

నేడు శంకర్‌పల్లికి మంత్రి శ్రీధర్‌బాబు రాక

శంకర్‌పల్లి, నవంబరు 5: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం శంకర్‌పల్లికి వస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్ లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఉదయం 9గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

చల్లంగ చూడు.. నాగమ్మ తల్లీ

ఘనంగా నాగుల చవితి వేడుకలు

ఆమనగల్లు/కడ్తాల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి వేడుకలు ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు పుట్టలో పాలు పోసి తమ కుటుంబాలకు చల్లగా చూడాలని నాగదేవతలను వేడుకున్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి హనుమాన్ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నాగభూషణం, శరత్‌చంద్రల ఆధ్వర్యంలో నాగదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుట్ట వద్ద మహిళల రద్దీ కన్పించింది. నాగదేవతలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



నియామకం

దిశ జిల్లా కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



మహేశ్వరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన జిల్లా డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశ) సభ్యుడిగా మహేశ్వరం మండలం రావిర్యాలకు చెందిన అంబోజు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి దన్యవాదాలు తెలిపారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని చెప్పారు.



పరిశోధనల్లో మేటి!

కొత్త వంగడాలపై ముమ్మరంగా రీసెర్చ్

- కంది, కుసుమ, జొన్న విత్తనాలపై విస్తృతంగా పరిశోధనలు
- తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడే లక్ష్యం
- 35 ఏళ్లుగా జొన్న వంగడాలపై పరిశోధన
- రీసెర్చ్‌లకు నిలయం తాండూరు పరిశోధన కేంద్రం

తాండూరు - కొడంగల్ రోడ్డు మార్గంలో కాగ్నా నది ఒడ్డున ఉన్న తాండూరు వ్యవసాయ రంగ పరిశోధన కేంద్రం పరిశోధనల్లో దూసుకుపోతోంది. శాస్త్రవేత్తలు కొత్త వంగడాలను ఆవిష్కరించడంలో ఇతర పరిశోధన కేంద్రాలతో పోటీ పడుతున్నారు. ప్రతీ యేడాది ఏదో ఒక రకమైన నూతన వంగడాలను తయారు చేస్తున్నారు. ఇక్కడ 35 ఏళ్లుగా కంది, జొన్న, కుసుమ పంటలపై విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. జాతీయ స్థాయిలో జరిగే పరిశోధనల్లోనూ ఈ సెంటర్ శాస్త్రవేత్తలు తీవ్రంగా పోటీ పడుతున్నారు.

- వివరాలు 7వ పేజీలో..




తాండూరు వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో జొన్న పాసు

సర్వేకు సిద్ధం

నేటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే

- ఈ నెల 30 వరకు నిర్వహణ
- 5,364మంది ఎన్యూమరేటర్లు, 1,690మంది ఉపాధ్యాయులు
- సర్వేకు గుర్తించిన గృహాలు 6,57,000
- ఎన్యూమరేటర్‌కు సుమారు 175ఇళ్లు కేటాయింపు
- పర్యవేక్షణకు 10మంది ఎన్యూమరేటర్‌లకు ఒక సూపర్‌వైజర్
- జిల్లాస్థాయిలో మానిటరింగ్ కోర్ కమిటీ ఏర్పాటు



రంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకి సర్వం సిద్ధమైంది. 15 రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియలో కుటుంబాల సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయం వంటి కీలక అంశాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం సేకరించనుంది. ఇందుకోసం కొన్ని రోజుల నుంచి అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం సన్నద్ధం చేసింది. నేటి నుంచి 30వ తేదీ లోపు సర్వే పూర్తయ్యేలా కలెక్టర్ నారాయణరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఆరు లక్షల 57వేల ఇళ్లను సర్వే చేసేందుకు గుర్తించారు. సర్వే చేసేందుకు 5,364మంది ఎన్యూమరేటర్లు, 1,690మంది ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నారు. వీరికి ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ ఇప్పించారు. ప్రతీ పదిమంది ఎన్యూమరేటర్లకు

- మిగతా 8వ పేజీలో..



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పక్కాగా కుటుంబ సర్వే

- ప్రతీ ఇంటిని కవర్ చేసేలా సమగ్రంగా..
- ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం ఇవ్వాలి
- సర్వేకు అన్ని వర్గాల వారూ సహకరించాలి
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి వెల్లడి

రంగారెడ్డి అర్బన్: ప్రతీ ఇంటిని, ప్రతీ వ్యక్తిని కవర్ చేసేలా పక్కాగా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణపై మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి జిల్లాలో నిర్వహించే కుటుంబ సమగ్ర సర్వేలో ఎన్యూమరేటర్లకు సరైన సమాచారం ఇవ్వాలని తెలిపారు. సామాజిక, ఆర్థిక,

- మిగతా 8వ పేజీలో..

న్యూస్ బాక్స్

కారులో చెలరేగిన మంటలు

- ఔటర్ రింగ్ రోడ్డుపై ఘటన
- తప్పిన పెను ప్రమాదం



మహేశ్వరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డుపై వెళ్తున్న ఓ కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ నుంచి గచ్చిబౌలి వైపు విద్యాసాగర్ అనే వ్యక్తి తన కియా కారులో వెళ్తున్నాడు. ఈక్రమంలో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్దకు రాగానే కారులోంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన విద్యాసాగర్ వెంటనే కారు ఆపి బయటకు దిగాడు. కారు పూర్తిగా దగ్ధమైంది. విద్యాసాగర్ టోల్ సిబ్బందికి సమాచారం అందించగా ఫైర్ ఇంజన్లతో కారు మంటలను అదుపు చేసే యత్నం చేసినా ఫలితం లేకపోయింది. పహడీ షరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మైసిగండి ఆలయ హుండీ లెక్కింపు

కడ్తాల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. 60 రోజులకు రూ.8,94,822 ఆదాయం లభించినట్లు ఆలయ పౌండర్‌ట్రస్టీ సిరోలి పంతూ, ఈవో స్నేహలత, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌లు తెలిపారు. ఈ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని స్నేహలత తెలిపారు.

నవగ్రహ విగ్రహాల ధ్వంసం

- శంషాబాద్ హనుమాన్ ఆలయంలో ఘటన
- గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- పోలీసుల అదుపులో అనుమానితుడు
- నేడు శంషాబాద్ బంద్‌కు పిలుపు

7

వర్షాన్ని కొలిచేదెలా?

యాచారం మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న రెయిన్‌గేజ్ కంపచెట్లతో నిండిపోయింది. వర్షం పడితే రెయిన్‌గేజ్‌లోకి చుక్కనీరు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంది. దాని నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

యాచారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)



యాచారంలో రెయిన్‌గేజ్‌లో పెరిగిన కంపచెట్లు

ఆరున్నరేళ్లుగా అసంపూర్తిగానే..



అర్ధంతరంగా ఆగిన దుకాణ సముదాయాల నిర్మాణం

- నిలిచిన దుకాణ సముదాయ నిర్మాణం
- శిథిలావస్థలో గోడలు.. పెరిగిన పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- విధిలేక రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- నిర్మాణం పూర్తి చేయాలంటూ రైతుల డిమాండ్
- నందివనపర్తి మార్కెట్ యార్డులో నిలిచిన పనులు

యాచారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివనపర్తి మార్కెట్ యార్డులో చేపట్టిన దుకాణ సముదాయ నిర్మాణ పనులు ఆరున్నరేళ్లుగా అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిర్మాణం పూర్తికాక పోవడంతో వీధుల్లో, రోడ్ల పక్కన కూరగాయలు విక్రయిస్తూ అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల కొరత కారణంగానే పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు కూరగాయలు విక్రయించుకునేందుకుగాను నందివనపర్తి మార్కెట్ యార్డులో దుకాణ సముదాయం నిర్మాణం చేపట్టారు. ఇందుకు ఇప్పటివరకు రూ.14లక్షల నిధులు ఖర్చు చేశారు. ఈ దుకాణ సముదాయంలో ఒక్క పక్క మాత్రమే గోడలు కట్టి ప్లాస్టింగ్ కూడా చేయకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. పలుచోట్ల గోడలకు రంధ్రాలు సైతం పడ్డాయి. అలాగే దుకాణాలకు షెట్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. మార్కెట్ యార్డు స్థలంలో పిచ్చిమొక్కలు పెరగడంతో అటువైపు ఎవరూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సముదాయం నిర్మాణాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి వేళ

- మిగతా 8వ పేజీలో..

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి

- ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుంది
- రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



- వివరాలు 8 లో

పెచ్చులూడుతున్న ఆసుపత్రి భవనం

- కలగానే కొత్త భవన నిర్మాణం
- సాగని పనులు
- తాత్కాలిక మరమ్మతుకు రూ.50లక్షలు మంజూరు



- వివరాలు 8 లో



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద టీచర్ల ధర్నా

రంగారెడ్డి అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద టీపీయూఎస్ ఆధ్వర్యంలో టీచర్లు ధర్నా చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 4 డీఏలు, ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీ రిపోర్టు తెప్పించుకుని అమలు చేయాలన్నారు. ఈ నెల 22 వరకు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుంటే 23వ తేదీ హైదరాబాద్ నగరంలో ధర్మాగ్రహ దీక్షను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కనుగొంటి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు కాశీరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, మహిళా కార్యదర్శి వనం సమ రంజిత, గౌరవ అధ్యక్షుడు సుధీర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటుకు

గిరిజనుల సంఘీభావం

ఐదోరోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు తలకొండపల్లి మండలం దాస్య తండా గిరిజనులు కదం తొక్కారు. మంగళవారం తండా నుంచి గట్టిప్పలపల్లికి పాదయాత్రగా చేరుకున్నారు. జేఏసీ నాయకులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గట్టిప్పలపల్లి గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళం ఐదో రోజుకు చేరాయి. దీక్షలకు దాస్య తండా గిరిజనులు మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్సులపల్లి తండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీ తండాలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంగా ఏర్పాటు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. జేఏసీ కన్వీనర్ అశోక్‌గౌడ్, వైస్ ఛైర్మన్ శరత్‌చంద్ర, శ్రీను నాయక్, లక్య నాయక్, దేవుడు, గోపాల్ నాయక్, బాలునాయక్, హరిలాల్, శంకర్, బక్య, ఆంజనేయులుగౌడ్, రాజు, కృష్ణాజీ, బాలయ్య, మాణిక్యరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

తలకొండపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాంపూర్ వేంకటేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ కమిటీ వైస్ చైర్మన్ కాకి అమృత అన్నారు. మంగళవారం వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అమృతకు ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో జిల్లా అధ్యక్షుడు జినుకుంట్ల భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అ మృతను పూలమాలలు, శాలువలతో సత్కరించి అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి వినోద్, రాంపూర్ గ్రామం మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్ రెడ్డి, నాయకులు కాకి కృష్ణ, ఆలయ పూజారి నర్సింహులయ్య, శ్రీనివాస్ చారి తదితరులున్నారు.

పరిశోధనల్లో మేటి!

- కొత్త వంగడాలపై ముమ్మర పరిశోధన
- కంది, కుసుమ, జొన్న, వంగడాలపై రీసెర్చ్
- తక్కువ పెట్టుబడి, ఎక్కువ దిగుబడే లక్ష్యం
- 35 ఏళ్లుగా జొన్న వంగడాలపై పరిశోధన
- తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పరిశోధనలు


కుసుమ పంట


కంది పంట

తాండూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : తాండూరు వ్యవసాయ రంగ పరిశోధన కేంద్రంలో ఆర్‌జీ-1 తెల్లరకం కందులు , టీడీఆర్ - జీ4 హన్మరకం కంది, టీడీఆర్ -జీ 59 తెల్ల కంది రకాలపై పరిశోధనలు జరిపారు. ఈ రకాలు ఎండు, గొడ్డు తెగులును తట్టుకుంటాయి. ఈ రకాలు సాధారణ వంగడాల ఆరు నెలల కాలం కంటే ముందుగానే 170 రోజుల లోపు పంట చేతికి వస్తుంది. పెట్టుబడి తక్కువ, దిగుబడి సాధారణ రకాల కంటే అధికంగా వస్తుంది. టీడీఆర్ - జీ59 రకం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. జాతీయ స్థాయిలో ఈ రకాన్ని అన్ని పరిశోధన కేంద్రాలలో విడుదల చేశారు. 2019 సంవత్సరంలో కంది పంట సాగుపై పరిశోధన జరిగింది. రేగడి భూములకు దీటుగా చిలుక భూముల్లో దిగుబడి అధికంగా ఇచ్చే రకాలపై పరిశోధనలు జరిపారు. అనువైన రకాలను గుర్తించే పరిశోధనలు జరిపారు. పూర్తి స్థాయిలో పరిశోధనలు జరిగాక వచ్చే ఏడాదిలో ఈ కొత్త రకం వంగడం విడుదల చేసే అవకాశం ఉంది.

160 రోజుల్లోనే జొన్న పంట చేతికి

ఈ పరిశోధన కేంద్రంలో 1989 నుంచి ఇప్పటి వరకు జొన్న పంటపై దాదాపు 35 ఏళ్ల పరిశోధన జరిపారు. ఎస్‌జీటీ-55 రకాన్ని 2003లో ఈ పరిశోధన కేంద్రం విడుదల చేసింది. ఎకరాకు సాధారణ జొన్న పంట 7- 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా ఈ రకంతో దిగుబడి పెరగనుంది. అలాగే ఏసీపీటీ 68 రకం వంగడంతో ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎస్‌పీటీ- 56వ రకం 10 - 12 క్వింటాళ్ల దిగుబడితో పాటు మొగ్గ తొలుచు, కాండం తొలుచు పురుగును తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రస్తుతం 20-24 టీడీఆర్ -272 జొన్న రకం తెగుళ్లను తట్టుకోని 160 రోజుల్లో కోతకు వచ్చే రకాన్ని కనుగున్నారు.

కుసుమలో ముత్యాల రకం వంగడాలు

ఈ పరిశోధన కేంద్రంలో కుసుమ రకం వంగడాల సృష్టీకరణపై సైతం అనేక పరిశోధనలు జరిపారు. ఈ విషయంలో ఇతర పరిశోధన కేంద్రాలతో ఇక్కడి శాస్త్రవేత్తలు పోటీ పడ్డారు. 1990లో మంజీర సాగర్ ముత్యాల రకం, పీఎస్‌టీ-1 రకం కుసుమ వంగడాలను విడుదల చేశారు. కుసుమపై జాతీయ స్థాయిలో 15 పరిశోధన కేంద్రాలలో పరిశోధనలు జరుగుతుండగా దిగుబడి ఏ విధంగా పెంచాలి? పెట్టుబడి ఎలా తగ్గించాలి? అనే కుసుమపై ఈ కేంద్రంలో పరిశోదనలు జరుగుతున్నాయి. కుసుమ నూనె ప్రస్తుతం 28 నుంచి 30శాతం వస్తుంది. దాన్ని 30 శాతం పెంచే విధంగా పరిశోధనలు కొనసాగుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మూడేళ్లుగా కుసుమ వంగడాలపై పరిశోధనలు జరుగుతుండగా టీఎస్ఎఫ్ రకం మూడు వంగడాలపై తాండూరు కేంద్రంలో పరిశోధన చేస్తున్నండగా రెండు వంగడాలపై జాతీయ స్థాయిలో ముందంజలో ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ వంగడాలు అన్ని ఆమోదం పొందిన తర్వాత రైతులకు అందించనున్నారు.

రైతులకు ఉపయోగపడేలా..



ఈ కేంద్రంలో మన ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల రైతులకు వంగడాలు ఉపయోగపడేలా పరిశోధనలు చేస్తున్నాం. ఇక్కడ కంది పంటతో పాటు కుసుమ, జొన్న వంగడాల్లో పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ వచ్చేలా పరిశోధనలు జరుగుతున్నాయి. అన్ని రకాల ఎండు తెగుళ్ల తట్టుకునే విధంగా వంగడాలను మార్కెట్‌లోకి తెచ్చాం. పరిశోధన కేంద్రంలో నిరంతరం శాస్త్రవేత్తల బృందం పరిశోధనలు చేస్తుంది. వచ్చే యేడాది కుసుమ వంగడాలు కొత్తవి విడుదల చేసే అవకాశముంది.

\- డాక్టర్ సుధారాణి, పరిశోధన స్థానం హెడ్, సీనియర్‌శాస్త్రవేత్త

పదేళ్లుగా కొనసాగుతున్న పరిశోధన



పదేళ్లుగా ఎండు తెగుళ్లను తట్టుకొని 160 రోజుల్లో వచ్చే దిగుబడి రకం టీడీఆర్‌జీ - 272 రకం కంది వంగడాలపై పరిశోధన చేస్తున్నాం. వచ్చే ఏడాది లోగా విడుదల చేస్తాం. టీఎస్ఎఫ్ కుసుమ రకం -446, 447 రకాలపై 2015 నుంచి పరిశోధనలు చేస్తున్నాం. ఎండు తెగుళ్ల తట్టుకోవడంతో పాటు ఎకరాకు 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే విధంగా పరిశోధనలు జరుగుతున్నాయి.

\- రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



మర్పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి మార్కెట్ యార్డులో మంగళవారం పశువుల సంతను ప్రారంభించారు. కరోనాకు ముందు మర్పల్లి మార్కెట్‌లో పశువుల సంత కొనసాగేదని, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తిరిగి సంతను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం మర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములుయాదవ్, కృష్ణారెడ్డి, రవీందర్, ఫసీయోద్దీన్, రాచన్న, గణేశ్, సర్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

శామీర్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి యూనియన్లను పునరుద్ధరించాలని ఆర్టీసీ మేడ్చల్ జిల్లా జేఏసీ కన్వీనర్ గోపు శ్రీనివాస్, ఆర్టీసీ టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి బీడీ రావులు అన్నారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని కలెక్టరేట్‌కు వెళ్లి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కలసి ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సమస్యలను తీర్చాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ టీఎంయూ రాష్ట్ర నాయకులు లక్ష్మయ్య, రమేశ్, నిరంజన్, నాగమణి, భాగ్యలక్ష్మి, వినోద తదితరులు పాల్గొన్నారు.

నాలుగు డీఏలు, పీఆర్సీని అమలు చేయాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను, పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని తపస్ రాష్ట్ర కోశాధికారి జిల్లా ఇన్‌చార్జి కరణం లక్ష్మీకాంత్‌రావు డిమాండ్ చేశారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట తపస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి నేతృత్వంలో మంగళవారం ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌లు హాజరైన సంఘీభావం తెలిపారు. మాదవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించి పెండింగ్ డీఏ, పీఆర్సీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి మాట్లాడుతూ.. 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. లేదంటే నవంబరు 23న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహి స్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రాములు, జాక వెంకటేశం, కమాల్‌రెడ్డి, ఆనందం, బుచ్చిలింగం, బకారం మల్లయ్య, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేశం, రమాదేవి, శ్రీలత పాల్గొన్నారు.

పులి కాదు.. హైనా



బొంరాస్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ గ్రామ పరిధిలోని పొలాల్లో పులి కనిపించిందంటూ రైతులు మంగళవారం భయాందోళనకు గురయ్యారు. వేరుశనగ పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు హైనాను చూసి భయపడి పులి అంటూ గ్రామంలోకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫారెస్టు బీట్ అధికారి ఆనంద్ రైతులతో కలిసి పంట పొలాల్లో పాదముద్రలను పరిశీలించారు. ఈ మేరకు పొలాల్లో సంచరిస్తున్నది పులి కాదని.. అవి హైనా పాద ముద్రలు అని తేల్చారు. రరైతులు ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు.

ఇనాం భూమి దళితులకే చెందాలి


నేదునూర్‌లో మాట్లాడుతున్న యాదయ్య

కందుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నేదునూరు గ్రామ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 154లోని ఎకరం 35 గుంటల భూమి దళితులకే చెందాలని, రెవెన్యూ అధికారులు వాస్తవాలు తెలుసుకోకుండా ఇతరులకు ఎలా రికార్డులు మార్చారని, దళితులకు అన్యాయం జరిగితే ఆందోళన చేపడతామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అయన గ్రామంలో భూమిని పరిశీలించి బాధిత రైతులతో పాటు గ్రామస్తులనుద్ధేశించి మాట్లాడారు. రాత్రివేళ రోడ్డుకు అడ్డంగా పాటక్ వేయడంలో అర్థమేంటని ప్రశ్నించారు. వందల ఎకరాలున్న బడా భూస్వాములు దళితుల భూములు అక్రమించుకుంటున్నా అధికారులు ఏం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా అధికారులు, భూస్వాములు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. సీపీఎం నాయకులు బుడ్డీరావు, యాదయ్య, రాములు, జంగయ్య, రాజయ్య చెన్నయ్య తదితరులున్నారు.

నేరాల అదుపునకు కృషి చేయాలి



కందుకూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, బాల్యవివాహాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణకు ప్రతీఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని సీఐ సీతారామ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో చిన్న, పెద్ద అనే తారతమ్యం లేకుండా మాదక ద్రవ్యాలను అమ్ముతున్నట్లు సమాచారం ఉందన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని బాల్యవివాహాలు చట్టపరంగా నేరమని సూచించారు. ఎస్సై సైదులు, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాలను పరిశీలిస్తున్న పోలీసులు


ఆలయం వద్ద హిందూ సంఘాల నేతల ఆందోళన

నవగ్రహ విగ్రహాల ధ్వంసం

- శంషాబాద్ హనుమాన్ ఆలయంలో ఘటన
- గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- హిందూ సంఘాలు, బీజేపీ నాయకుల ఆందోళన
- పోలీసుల అదుపులో అనుమానితుడు

శంషాబాద్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్, ఎయిర్‌పోర్టు కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఉన్న నవగ్రహాల విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి కింద పడి ఉన్న విగ్రహాలను గమనించి స్థానిక కౌన్సిలర్ అమృతా రెడ్డికి సమాచారం ఇచ్చారు. అమృతారెడ్డి ద్వారా విషయం తెలిసి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకున్న ఏసీపీ కేఎస్ రావు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఇంతలో విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాల నేతలు ఆలయం వద్ద ఆందోళనకు దిగారు. అయితే, ప్రత్యేక బలగాల సాయంతో ఆందోళనకారులను అడ్డుకున్న డీసీపీ రాజేష్.. ఆలయ పరిసరాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. అలాగే క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కాగా, విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. నిందితులు ఎవరైనా సరే విడిచిపెట్టేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రాజేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా, విగ్రహాల ధ్వంసానికి సంబంధించి స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కొద్ది రోజులుగా ఎయిర్‌పోర్టు కాలనీలో సంచరిస్తున్న బిహార్‌కు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని డీసీపీ తెలిపారు. సదరు వ్యక్తికి మతిస్థిమితం లేదని స్థానికులు చెప్పారని, విచారణ చేస్తున్నామని వివరించారు.

నేడు శంషాబాద్ బంద్

శంషాబాద్: శంషాబాద్ బంద్ నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ నిర్ణయించింది. శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు నిర్వాసితుల కాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని నవగ్రహాలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిని నిరసిస్తూ బుధవారం శంషాబాద్ బంద్‌కు ఆ సంఘం పిలుపునిచ్చింది. వ్యాపారులు, విద్యా సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని వీహెచ్‌పీ విజ్ఞప్తి చేసింది.

ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టులో మంగళవారం మొదటి విడత చేప పిల్లలను పంపిణీ చేశారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి చేతుల మీదుగా మత్స్యశాఖ తరఫున చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. మొదటి విడతగా 14 చెరువుల్లో 13 లక్షల చేప పిల్లలను జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. బీసీ కులగణనకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ అంబయ్యగౌడ్, మత్స్య సహకార సంఘం నాయకులు నర్సింహులుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింహులు నాయుడు, మెరుగు వెంకటయ్య, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

దౌల్తాబాద్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకుని మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ గాయత్రి, వ్యవసాయ అధికారిణి లావణ్య, అంబయ్యగౌడ్, విజయ్‌కుమార్, ప్రమోద్‌రావు, ప్రశాంత్, వీరన్న, మల్లేశ్ పాల్గొన్నారు.

రైతు బజార్‌ను అందుబాటులోకి తెస్తాం



చేవెళ్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రైతుబజార్‌ను తొందరలోనే ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని చేవెళ్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్ స్పష్టం చేశారు. ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో ప్రారంభించి వదిలేశారు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం, అధికారులు స్పందించారు. ఈమేరకు మంగళవారం పెంటయ్య, వైస్ ఛైర్మన్ రాములు, డైరెక్టర్లు మల్లేష్, నరేందర్ తదితరులు స్వయంగా దగ్గరుండి జేసీబీ, డోజర్లతో రైతు బజార్ లోపల, బయట పేరుకుపోయిన వ్యర్థాలను, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేయించారు. ఛైర్మన్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనం మార్కెట్ పాలకవర్గాన్ని, అధికారులను స్పందింపజేసిందన్నారు. మార్కెట్ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, మార్కెట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మహాసభ'ను విజయవంతం చేయాలి



శంషాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న శంషాబాద్‌లో నిర్వహించే సెకండ్ ఏఎన్ఎంల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. ఈమేరకు మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. పర్వతాలు మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, వి. సత్యనారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం


మాట్లాడుతున్న పామెన భీంభరత్

మొయినాబాద్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనతో బీసీల చిరకాల ఆకాంక్ష నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లోని ఆయన ఇంట్లో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకమని అన్నారు. రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన కులాలకు మేలు జరుగుతుందన్నారు. కులగణనకు ప్రజలందరూ సహకరించాలని సూచించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతుందని, ప్రతి పక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని, ప్రజలు ఆందోళన చెందొద్దన్నారు. కాంగ్రెస్ హిమాయత్ నగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బుర్రకాయల రమేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఓటరు జాబితాను సవరించండి

షాద్‌నగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితాను సవరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం షాద్‌నగర్ ఆర్డీవో సరితను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ నేతలు శీనునాయక్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్టోబరులో చేపట్టిన ఓటరు జాబితాలో సవరణలు చేపట్టాలని కోరారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టిన తర్వాతనే తుది జాబితాను వెల్లడించాలన్నారు.

కానోకార్పస్ చెట్లు తొలగించాలి

కడ్తాల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారికి మధ్యలో ఉన్న కానోకార్పస్ చెట్లను తొలగించాలని స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందజేశారు. కానోకార్పస్ చెట్ల వల్ల ప్రమాదం పొంచి ఉందన్నారు. కేఎన్ఆర్‌యు వసేన జిల్లా అధ్యక్షుడు నరేశ్ నాయక్, కాంగ్రెస్ బీసీసెల్ మండలాధ్యక్షుడు యాదయ్య, కడ్తాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌గౌడ్, తదితరులున్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న నాయకులు

పెచ్చులూడుతున్న ఆసుపత్రి భవనం

- కలగానే కొత్త భవన నిర్మాణం
- శంకుస్థాపన చేసినా ముందుకు సాగని పనులు
- తాత్కాలిక మరమ్మతుకు రూ.50లక్షలు మంజూరు
- నూతన భవనం నిర్మించాలని ప్రజల వేడుకోలు


శిథిలావస్థకు చేరిన ప్రభుత్వాసుపత్రి


పైకప్పు పెచ్చులూడిన ఆసుపత్రి భవనం

యాచారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. రూ.కోటీ 50లక్షల నిధులతో 2023 ఆగస్టు17న కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ భవన నిర్మాణానికి ఆనాటి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న భవనం 1960 ప్రాంతంలో నిర్మించారు. నేడు పలు చోట్ల ఆసుపత్రి భవనంలో పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో గదుల్లోకి నీరు చేరుతోంది. పలు గదుల్లో పైకప్పు పెచ్చులూడి రోగులు, వైద్యులపై పడుతున్నాయి. ఆసుపత్రికి నూతన భవనం అవసరమని ఆనాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి చేత కొత్త భవనం కట్టించడానికి నిధులు మంజూరు చేయించారు. వారం వ్యవధిలో పనులు ప్రారంభించాలని మంత్రి హరీష్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భవన నిర్మాణ పనులను అధికారులు గాలికొదిలేశారు. కాగా, భవన నిర్మాణ చేపట్టాలని ఆనాటి ఎంపీపీ సుకన్యబాషా, జెడ్పీటీసీ జంగమ్మలు పలుమార్లు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చినా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. గత ప్రభుత్వం నిధులు కేటాయించినా పనులు ప్రారంభించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

అగిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడానికి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆపరేషన్ గదిలో సరైన వసతులు లేకపోవడంతో ఆపరేషన్లు చేయలేకపోతున్నామని వైద్యులు చెబుతున్నారు. నాలుగేళ్లుగా ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం లేదు. దాంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకుంటున్నారు.

మరమ్మతులకు రూ.50లక్షలు మంజూరు

ప్రస్తుతం ఉన్న పాత భవనం మరమ్మతుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.50లక్షల నిధులు మంజూరు చేసింది. ఆసుపత్రి భవన దుస్థితిపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలకు కలెక్టర్ శశాంక స్పందించారు. ఎంత మేర నిధులు అవసరమవుతాయో ఎస్టిమేషన్ వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దాంతో ఇబ్రహీంపట్నం పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈతో పాటు ఇంజనీరింగ్ అధికారుల బృందం ఆసుపత్రి భవనం పరిశీలించి నిధులు ఎంతమేర అవసరమవుతాయో ఎస్టిమేషన్ వేసి కలెక్టర్‌కు సమర్పించారు. టెండర్ ఖరారు కాగానే స్లాబ్ వేయడం, కిటికీలు, తలుపులు బిగించడం, నీటి వసతి కల్పించడం తదితర పనులు చేయనున్నారు. భవనానికి మరమ్మతులు పూర్తికాగానే ఇక్కడ కుటుంబ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని వైద్యాధికారులు నిర్ణయించారు.

కలగానే నూతన భవన నిర్మాణం

ఆసుపత్రి ఆవరణలో విశాలమైన స్థలం ఉంది. భవన నిర్మాణం కోసం రూ.కోటీ 50లక్షల నిధులతో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేసినా ఇప్పటికీ నోచుకోవడం లేదు. ఎమ్మెల్యే రంగారెడ్డి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కొత్త భవనం నిర్మించి మెరుగైన సేవలందిస్తే నల్గొండ జిల్లా వాసులతో పాటు కందుకూరు, కడ్తాల మండలంలోని పలు గ్రామాల రోగులకు సేవలందుతాయి.

కొత్త భవనం కట్టించండి



మండల కేంద్రంలో ఉన్న ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. కొత్త భవనం కట్టిస్తే రోగులకు మెరుగైన సేవలందుతాయి. గత ప్రభుత్వం రూ.కోటీ 50లక్షలతో కొత్త భవనం నిర్మాణ చేపడుతుందనుకుంటే ఇంత వరకు పనులు ప్రారంభించనేలేదు. కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులు కొత్త భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి.

- ఎన్.కృష్ణ, రైతు చౌదర్‌పల్లి

ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు



మండల కేంద్రంలో కొత్త భవనం నిర్మిస్తారనుకుంటే ఇంత వరకు పనులు ప్రారంభించ లేదు. ప్రభుత్వం మారితే అధికారులు ఏం చేస్తున్నారు? టెండర్ పిలిచినా భవనం ఎందుకు నిర్మాణం చేయడం లేదు. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో వసతులు లేక కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఆగిపోవడంతో పేద ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే భవనం నిర్మించాలి.

- అలంపల్లి నర్సింహ, రైతు, మేడిపల్లి

క్రైం కార్నర్

తిమ్మాపూర్‌లో చోరీ

- బంగారం, వెండి వస్తువులు అపహరణ

కొత్తూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నలగంటి స్వామి ఇంట్లో గుర్తుతెలియని దొంగలు సోమవారం రాత్రి చొరబడి బంగారం, వెండి అభరణాలు దొంగిలించుకపోయారు. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. సోమవారం స్వామి ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లగా గుర్తు తెలియని దొంగలు తలుపు తాళం బద్దలు కొట్టి బీరువాలోని 2తులాల బంగారం, 20తులాల వెండి, కొంత నగదును దోచుకుపోయారని పేర్కొన్నాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

షాద్‌నగర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ బస్టాండ్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను మంగళవారం రాత్రి ప్రయాణికులు పట్టుకున్నారు. పరిగి మండలం సైదుపల్లికి చెందిన కృష్ణయ్య షాద్‌నగర్‌కు పని మీద వచ్చి తిరుగు ప్రయాణంలో రాత్రి 6.30 గంటలకు పరిగి బస్సు ఎక్కి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో సెల్‌ఫోన్ దొంగిలించినట్లు తెలుసుకుని వెంటనే బస్సు దిగాడు. అక్కడే ఉన్న మరో ప్రయాణికుడు బస్సు దిగి పరిగెత్తుతున్న వ్యక్తిని చూపించాడు. వెంటనే పరిగెత్తి అతడిని చెక్ చేయగా ఫోన్ కనిపించింది. అంతలోనే అక్కడికి చేరుకున్న మిగతా ప్రయాణికులు మరో స్కూటీతో పారిపోవడానికి సిద్ధంగా ఉన్న మరో దొంగను పట్టుకున్నారు. అక్కడే ఉన్న మరో దొంగ పారిపోయాడు. ఇద్దరు దొంగలను బస్ డిపో సెక్యూరిటీకి అప్పగించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని 5 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన ఇద్దరు హైదరాబాద్ బార్కాస్ సలాలకు చెందిన ఫైజల్(18), అహ్మద్ జాబ్రీద్(21)గా గుర్తించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కడ్తాల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్కల్ పహాడ్ సమీపంలో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కర్కల్‌పహాడ్ భారత్ పెట్రోల్ బంక్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన కాలువలో మృత దేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్‌లు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగి ఉంటుందని, రెండు మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఎక్కడో చంపి మృతదేహాన్ని ఇక్కడ వేసినట్లు అనుమానిస్తున్నారు. ముఖం కుళ్లిపోవడంతో గుర్తించరాని విధంగా ఉందని, శరీరంపై ఆరెంజ్ కలర్ బ్లౌజ్, (నెమలి బొమ్మ), ముఖం చుట్టు గ్రీన్ కలర్ టవల్, బ్లూ లైట్ గ్రీన్ కలర్ కలిగిన దుప్పటి మృతదేహంపై ఉన్నాయని తెలిపారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, వేలి ముద్రల నిపుణులు సందర్శించి వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మహిళ వివరాలు తెలిసినవారు కడ్తాల్ సీఐ సెల్- 8333993536, ఎస్సై-8712568298, స్టేషన్ -9493628100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై వరప్రసాద్ కోరారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వ్యక్తిపై కేసు నమోదు.. వాహనం సీజ్

చౌదరిగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియాన్ని సీజ్‌చేసి ఒకరిపై కేసు నమోదు చేసిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని చిన్నఎల్కిచర్లలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మంగళవారం కొందుర్గు పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్లలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని పాఠశాల వద్ద పోలీస్ వాహనానికి ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి విచారించగా చిన్నఎల్కిచర్లకు చెందిన డ్రైవర్ సురేందర్‌గా గుర్తించారు. డీసీఎంలో ఏం ఉన్నాయని అడగడంతో పొంతనలేని సమాధానం ఇచ్చాడు. దాంతో తనిఖీ చేయగా 100 బియ్యం సంచుల బస్తాలు(50క్వింటాళ్లు) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బియ్యం, వాహనాన్ని, సురేందర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు కొందుర్గు పోలీసులు తెలిపారు.

సర్వేకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ఒక సూపర్‌వైజర్‌ను ప్రభుత్వం నియమించింది. అలాగే జిల్లా స్థాయిలో ఓ ప్రత్యేకాధికారిని నియమించడంతో పాటు సర్వే మానిటరింగ్ కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఆయా బ్లాకుల్లో ఉన్న ఇళ్ల వివరాల జాబితాను ఎన్యుమరేటర్లు సేకరించనున్నారు. ఒక్క ఎన్యూమరేటర్ సుమారు 175 ఇళ్లను సర్వే చేయనున్నారు. తర్వాత 15 రోజుల పాటు ప్రతీ ఇంటికి వెళ్లి ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం కుటుంబంలోని వివరాలను సేకరిస్తారు. సమగ్ర సర్వేలో అడిగే ప్రశ్నలను రెండు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగంలో కుటుంబ యజమానితో పాటు ఇంటి సభ్యుల వ్యక్తిగత వివరాలను సేకరిస్తారు. రెండో విభాగంలో కుటుంబ పూర్తి వివరాలు తీసుకుంటారు. ఈ ప్రక్రియలో 56 ప్రశ్నలను సర్వే అధికారులు ప్రతి కుటుంబాన్నీ అడుగుతారు. సర్వే నిర్వహించిన తర్వాత ఇంటికి స్టిక్కర్ అంటిస్తారు.

పక్కాగా కుటుంబ సర్వే

విద్య, రాజకీయ, సమగ్ర సర్వేకు రాజకీయాల కతీతంగా అందరూ సహకరించాలన్నారు. సమాచారం సేకరించిన ఎన్యుమరేటర్లు అత్యంత జాగ్రత్తగా వివరాలను వారికి ఇచ్చిన ఫార్మట్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో మున్సిపల్ మినహా 5,364 మంది ఎన్యూమరేటర్లను సర్వేకోసం నియమించామన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు సర్వేలో పాల్గొననున్నట్లు చెప్పారు. ప్రాథమిక స్థాయిలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఒక పూట సర్వే నిర్వహిస్తారని చెప్పారు. ప్రతీ ఒక్కరు ఆధార్, రేషన్ కార్డు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సర్వేలో కుటుంబానికి సంబంధించిన విషయాలే ఉన్నందున, ప్రభుత్వం చేసే సర్వేలో ప్రజలు ఎలాంటి అపోహలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. మీడియా సమావేశంలో సీపీవో సౌమ్య, డీపీఆర్వో వెంకటేశం పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న డాక్టర్ వత్సల రాణి

కందుకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికలు హక్కుల సాధనకు కృషి చేయాలని, పర్యావరణ పరిరక్షణలో బాలికల పాత్ర వెలకట్టలేనిదని, ఉన్నత చదువులు చదివి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఐఐసీటీ-హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ వత్సల రాణి అన్నారు. మంగళవారం కందుకూరు మండలంలోని నేదునూరు మోడల్ పాఠశాలను ఆమె ఆధ్వర్యంలో 16 మంది శాస్త్రవేత్తలు సందర్శించి వారి హక్కులు, ఉన్నత చదువులు చదివితే కలిగే లాభాలను బాలికలకు వివరించారు. ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మాట్లాడుతూ పరిశోధనల పట్ల బాలబాలికలు ఆసక్తి పెంచుకోవాలన్నారు. దేశభవిష్యత్తు మీపై ఉందని చెప్పారు. మున్ముందు అనేక పరీక్షలలో పాల్గొని దేశానికి అవసరమయ్యే పరిశోధనలు చేయడంపై చొరవ తీసుకోవాలనిచెప్పారు. భవిష్యత్తులో మీరు శాస్త్రవేత్తలు కావాలని దీవించారు. డాక్టర్ అ రుణ, డాక్టర్ రాజశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై సబితారెడ్డి ఆరోపణలు సరికాదు


మాట్లాడుతున్న నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నంత కాలం సర్పంచ్‌లకు రావాల్సిన బకాయి బిల్లుల గూర్చి ఏనాడూ నోరుమెదపని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి.. అధికారం పోయాక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌లు అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది, గ్రామాల్లో పనులు చేయించి సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వనిది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని సబితాఇంద్రారెడ్డి గుర్తెరిగి మసులుకోవాలన్నారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారం కోల్పోవడం జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. తమను ఇబ్బందులకు గురిచేసింది, చేసిన పనులకు బిల్లులు ఇవ్వనిది ఏ ప్రభుత్వమో తెలిసి కూడ తాజా మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడం తగదన్నారు. గ్రామాలను గొప్పగా ఉద్ధరించామని చెప్పుకొస్తున్న బీఆర్ఎస్ నాయకులు చేసిన పనులకు బిల్లులు ఎందుకు చెల్లించలేదని నర్సింహ, శ్రీనివాస్ రెడ్డి, బీక్యనాయక్‌లు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గ్రామాలలో చేపట్టిన చాలా పనులు కేంద్రం నిధులు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేసినవేనని అన్నారు. కేంద్రం నిధులు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి సర్పంచ్ లకు బిల్లులు చెల్లించకుండ వేదనకు గురి చేసిందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రజాపాలనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేటీఆర్, హరీశ్ రావులు సర్పంచ్‌ల బకాయి బిల్లుల గూర్చి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సర్పంచ్‌లకు బకాయి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి చెల్లించడానికి చర్యలు తీసుకుంటుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు జహంగీర్‌బాబా, కృష్ణనాయక్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపులో పాల్గొన్న సిరోలిపంతూ, ఈవో స్నేహలత తదితరులు

కడ్తాల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌ల సమక్షంలో హుండీలను లెక్కించారు. 60 రోజులకు గాను రూ.8,94,822ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో స్నేహలత తెలిపారు. హుండి ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేసి ఆలయ అభివృద్ధి, భక్తుల కు సదుపాయాల కల్పనకు ఖర్చు చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఆర్‌పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, వెంకటరమణ, సంతోష్‌కుమార్, చంద్రయ్య, కృష్ణ, శ్రీనివాసులు, పత్యానాయక్, కృష్ణయ్య, బీబీ చారి, శ్రీను, హర్ష వర్ధన్ రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాసరావు, కేనరా బ్యాంక్ సిబ్బంది లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరున్నరేళ్లుగా అసంపూర్తిగానే..

(5వ పేజీ తరువాయి)

మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాల కోసం దుకాణ సముదాయ నిర్మాణాలు పూర్తిచేసి ఆదుకోవాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ దుకాణ సముదాయ నిర్మాణాలు పూర్తి చేయడానికి మరో రూ.60లక్షల నిధులు అవసరం కానున్నాయని అధికారులు అంచనా వేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను కోరుతున్నా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు రూ.కోటి నిధులతో మరో దుకాణ సముదాయం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ యార్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో రైతులు, కూరగాయల వ్యాపారులు గల్లీల్లో కూరగాయల అమ్ముకుంటున్నారు.

నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



గ్రామంలో పంచాయతీకి చెందిన విశాలమైన స్థలం ఉండికూడా మార్కెట్ యార్డు నిర్మించక పోవడం దారుణం. మార్కెట్ యార్డులో షెడ్డులు నిర్మించి మాకు కేటాయిస్తే కూరగాయలను అక్కడే భద్రపరిచి మరుసటి రోజు కూడా అ మ్ముకునేందుకు వీలుంటుంది. ఇప్పుడు రోడ్ల వెంట పెట్టడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం

- శిరీష, మహిళా రైతు, నందివనపర్తి

'సమగ్ర సర్వే'కు సహకరించాలి


చౌదరిగూడ : తుమ్మలపల్లిలో కులగణన సర్వే స్టిక్కర్లు వేస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

షాబాద్/ మొయినాబాద్ రూరల్/ చేవెళ్ల/ చౌదరిగూడ/ కేశంపేట/ తలకొండపల్లి/ మాడ్గుల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. షాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి సమగ్ర సర్వేకు సబంధించిన వివరాలను వెల్లడించారు. అక్టోబరు 28న సర్వేకు సబంధించిన కలెక్టరేట్‌లో అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అలాగే నేటి నుంచి చేపట్టనున్న ఇంటింటి కుటుంబ సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మొయినాబాద్ ఎంపీడీవో తెలిపారు. వారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కులగణనను మండలంలో విజయవంతంగా పూర్తి చేస్తామని, ప్రజలు సహకరించాలని సూచించారు. ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈవో వెంకటయ్య అధికారులు ఉన్నారు. సమగ్ర సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేవెళ్ల మండలంలోని 37 గ్రామ పంచాయతీలు, అనుబంధ గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం ఈనెల 6నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. సూపరింటెండెంట్ రవీందర్ తదితరులు ఉన్నారు. కులగణను పక్కాగా చేపట్టాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లిలో ఇంటింటికి వేస్తున్న స్టికర్స్‌ను ఆయన పరిశీలించి వివరాలను సేకరించారు. కార్యదర్శి సౌజన్య, టీఏ లక్ష్మారెడ్డి, దేవోజీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు. కేశంపేట మండలంలో నేటి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి జరిగే సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ మరియు కులసర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రతి ఇంటికెళ్లి పక్కగా చేయాలని తలకొండపల్లి ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దారు నాగార్జునలు ఎన్యుమరేటర్లను కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో 12,262 ఇండ్ల సర్వే చేయాలన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ కోరారు. సర్వే ఆధారంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని సూచించారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని, మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం డీసీఎంఎస్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సన్న రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్‌గా ఇస్తుందని ఇది రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉందన్నారు. దళారీలకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించవద్దంటూ సలహా చేశారు. తరుగు పేరుతో ఎక్కడైనా ఎక్కువ తూకం వేయకుండా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రంధ్రాలు పడ్డ టార్పాలిన్లను మార్చి కొత్తవి వాడాలని సూచించారు. ధాన్యం మిల్లులకు చేరిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామని డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుధాకర్, ఏడీఏ సుజాత, తహసీల్దారు సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో విస్తరిస్తున్న కాలనీల్లో మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో రూ.8.09 కోట్లతో పలు వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. భాగ్యనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ఇళ్ల మధ్యనే మురుగు పారుతుందని అయినా కాలనీకి కేటాయించాల్సిన నిధులను పక్కదారి మళ్లిస్తున్నారంటూ కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 22వ వార్డులో మల్టీపర్పస్ హాల్‌కు కేటాయించిన నిధులు రూ.1.35 కోట్లను భాగ్యనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణంకోసం డైవర్షన్ చేయాలని మున్సిపల్ కమీషనర్ రవీంద్రసాగర్‌ను ఆదేశించారు. మల్టీపర్పస్ హాల్ కోసం తాను నిధులు ఇస్తానని చెప్పారు. చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్మన్ మంగ, కౌన్సిలర్లు భానుబాబు, ఇందిరాల రమేష్, జోర్కని బాల్‌రాజ్, శంకరయ్య, ఆకుల మమత, ఈర్లపల్లి సునీత, సుల్తానా బేగం తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

● **కేశంపేట** : మండల కేంద్రానికి చెందిన లిక్కి శంకరయ్య సోమవారం రాత్రి మృతి చెందాడు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి రూ.5వేలు, కేశంపేట గ్రామానికి చెందిన సినియర్ జర్నలిస్ట్ రమణగౌడ్ రూ.5వేలు, తలసాని పవన్ కుమార్ రెడ్డి రూ.3వేలు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, శ్రీశైలం, మల్లేష్, జంగయ్య, శివకృష్ణ, పాండుగౌడ్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8న రక్తదాన శిబిరం

● **ఆమనగల్లు** : పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్‌లో ఈనెల 8న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు తెలిపారు. మంగళవారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నరేందర్ రెడ్డిని కలిసిన మహేశ్

● **తలకొండపల్లి** : రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని మంగళవారం తలకొండపల్లి కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు గుజ్జల మహేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి సూచించినట్లు తెలిపారు.

నేదునూరు-బాచుపల్లి రోడ్డుకు మరమ్మతులు

● **కందుకూరు** : నేదునూరు నుంచి బాచుపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై బాచుపల్లి అంబేడ్కర్ సంఘం సభ్యులు మంగళవారం మట్టిని పోసి మరమ్మతులు చేశారు. రెండున్నర కిలోమీటర్ల మేరకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చొరవతో డబుల్(బీటి) రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోతులను పూడ్చారు.


ప్రపంచ పర్యాటక సదస్సుకు కసిరెడ్డి



మంత్రి జూపల్లితో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): లండన్ వేదికగా జరుగుతున్న ప్రపంచ పర్యాటక సదస్సు వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. వారం రోజుల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే లండన్ వెళ్లారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, అనిరుధ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డిలతో కలిసి నారాయణరెడ్డి తెలంగాణ ప్రభుత్వం తరఫున సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని కసిరెడ్డి తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించామని కసిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

బోయిన్‌పల్లి సభకు తరలిన నాయకులు


సభకు తరలిన ఎమ్మెల్యే యాదయ్య నాయకులు

చేవెళ్ల/మహేశ్వరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర కులగణన సమీక్షా సమావేశంలో భాగంగా సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలో జరుగుతున్న రాహుల్ గాంధీ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు. అలాగే రాహుల్ గాంధీకి ఆహ్వానం పలికేందుకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి మంగళవారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెల్లారు. దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరంలో వచ్చే ఎన్నికలు ఏవైనా విజయం దిశగా పనిచేయనున్నట్లు తెలిపారు. ఏనుగు జంగారెడ్డి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు 'పట్నం'లోనే బస్ పాస్‌లివ్వాలి

యాచారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు జిల్లా బస్‌పాస్‌లను ఇబ్రహీంపట్నంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందించాలని బీజేపీ యాచారం మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. బుధవారం మొండిగౌరెల్లిలో పలువురు దివ్యాంగులకు జిల్లా బస్‌పాస్‌లను ఆయన అందించారు. బస్‌పాస్‌ల కోసం దిల్‌సుఖ్‌నగర్ వెళ్లలేక చాలా మంది దివ్యాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారని రంగారెడ్డి ఆర్ఎం గమనించి ఆదుకోవాలని కోరారు. ప్రతీ నెల 1నుంచి 15వ తేదీ వరకు ఇబ్రహీంపట్నంలో కౌంటర్ పెట్టి బస్‌పాస్‌లందించడం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మాజీ ఉపసర్పంచ్ యాదగిరిరెడ్డి, అంజయ్య తదితరులున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించాలి

యాచారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించి ఆదుకోవాలని కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి వైద్యులను కోరారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను మంగళవారం మాల్‌లోని పీపుల్స్ ఆసుపత్రిలో పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో మరణించిన మూలి బుచ్చమ్మ కుటుంబికులకు ధైర్యం చెప్పారు. కారు యజమాని నుంచి బాధితులకు, మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయమందించడానికి చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ముత్యాల వెంకటరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహ ఉన్నారు.